క్లుప్తంగా

హుకుంపేటలో భారీ వర్షం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో వారపు సంత కావడంతో సంతకు వచ్చిన గిరిజనులు వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవ రాట



ముహూర్తపు కార్యక్రమాలు పాల్గొన్న భక్తులు

సీలేరు: సీలేరు గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా శనివారం మార్కెట్ సెంటర్ లో అమ్మవారి ముహూర్తపు రాటను ఘనంగా చేపట్టారు. ఈ ఏడాది ఘనంగా నవరాత్రులను చేపట్టేందుకు యువత ముందుకు వచ్చారు. అర్చకులు దామోదరం శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులతో పాటు వానపల్లి అప్పారావు దంపతులుపాల్గొన్నారు. భవానీ మాలధారులు కూడా అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణ. శ్రీను. ఎంపీటీసీ సాంబమూర్తి. సర్పంచి దుర్గో. వైస్ సర్పంచ్ వల్లి ప్రసాద్, ఎస్ఐ రవీంద్ర. గ్రామపెద్దలు కారె శ్రీనివాస్. బుర్ర కృష్ణ . జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు. పలువురు అమ్మవారికి నగదును అందజేశారు.

పశువులకు వ్యాక్సినేషన్

రాజవొమ్మంగి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు వెటర్నరీ డాక్టర్ తరుణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పశువులను కొట్టాల్లోనే ఉంచి టీకాలు వేసేందుకు వచ్చిన వెటర్నరీ అసిస్టెంట్లు, సిబ్బందికి సహరించాలని డాక్టర్ తరుణ్ కోరారు. మండలానికి 12వేల టీకాలు సరఫరా అయినట్టు వెల్లడించారు. మండలంలో సుమారు 12వేల తెల్లజాతి, నల్లజాతి పశువులు ఉన్నట్టు ఆయన తెలిపారు. పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు రైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని ఆయన కోరారు.

గిరిజన సమస్యలపై న్యాయ పోరాటం

గూడెం కొత్తవీధి: మండలంలోని దారకొండ పంచాయతీ చిన్నగంగవరంలో శనివారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య మండల సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు దిసారి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గూడెం కొత్తవీధి మండలం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో మండల గిరిజన సమాఖ్య కార్యదర్శిగా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా రాము. సోదనో, మండల అధ్యక్షుడిగా బలరామ్, ఉపాధ్యక్షుడిగా రమేష్, 20 మందిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గిరిజన సమస్యలపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. సీపీఐ నాయకులు విష్ణుమూర్తి, పోతురాజు, వర్ల భగవాన్, చిట్టిబాబు, నారాయణ, త్రినాథ్, దుప్పులవాడ మాజీ ఎంపీటీసీ కిల్లో తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా గురుకుల పాఠశాల



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

సీలేరు: సీలేరు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎట్టకేలకు వసతి సమస్య తీరింది. అరకొర వసతి సమస్యతో మొన్నటి వరకు ఇబ్బందులు పద్ద విద్యార్థులకు రూ.2కోట్లతో నిర్మాణం చేపట్టిన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ పాఠశాలలో 5 నుంచి 10 తరగతిలో విద్యార్థులు 401 మంది విద్యార్థులు ఉన్నారు.ఇప్పటివరకు ఒక భవనం మాత్రమే ఉంది మరికొన్ని రేకుల షెడ్డు, ఎన్నో ఏళ్ల కిందన కట్టిన భవనాల్లో విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎట్టకేలకు పాఠశాలకు కొత్త భవనం నిర్మాణమైంది. కొద్ది రోజుల్లో భవనం అందుబాటులో రానుంది.

అందుబాటులో యూరియా

రాజవొమ్మంగి: మండలంలో 81.41 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు ఏఓ చక్రధర్ తెలిపారు. కొమాపురం రైతు సేవా కేంద్రంలో- 20.25 టన్నుల రాజవొమ్మంగి రైతు సేవా కేంద్రంలో -4.05 టన్నులు, జడ్డంగిలో -1.125 టన్నులు, అలాగే ప్రయివేటు డీలర్ల వద్ద 55.99 టన్నుల యూరియా ఉన్నట్టు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అటకెక్కిన విద్య

- పాఠశాలల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- 80 రోజులుగా పలు పాఠశాలలు మూత
- పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆవేదన



గుమ్మలరేవులో ఉపాధ్యాయిలు లేక పాఠశాల ఎదుట విద్యార్థులు



కుమ్మరపల్లిలో ఉపాధ్యాయులు లేక ఆరుబయట విద్యార్థులు

సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు నియోజవర్గంలో గిరిజన విద్యార్థుల చదువులు కొండెక్కాయి. చదువులు చెప్పే గురువు లేక విద్యార్థుల యొక్క భవిష్యత్తు అంధకారంలోకి నెట్టింది.స్కూల్ తెరిచి నేటికీ 80 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయి. కళ్ల ముందే తమ పిల్లలు భవిష్యత్తు నాశనమవుతుంటే తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కొత్త ఉపాధ్యాయులు రాకుండా ఉన్న ఉపాధ్యాయులు బదిలీ చేయడం వల్లన ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు వెళ్లిన చదువులు చెప్పే పరిస్థితి లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని వ్యవసాయానికి తీసుకెళ్తున్నారు. కొందరు చెట్లు పుట్టలు తిరుగుతూ మరి కొందరు పశువులు వెంట కాపలాగా మారారు.వాగులు, గెడ్డల వద్ద ఆడుకునే పరిస్థితి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితి ఏ ప్రభుత్వంలోని మా గిరిజన పిల్లలకు రాలేదని పలువురు గిరిజన సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు.



ఉపాధ్యాయుల కోసం గ్రామస్తుల ఆందోళన

దారితప్పిన ప్రాథమిక విద్య

ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు గిరిజనులకు దిక్కు. ముఖ్యంగా ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు లేక చదువుకు దూరమవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో విద్యాశాఖలో విప్లవ మార్పులు తీసుకొచ్చి పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుత పరిస్థితి విద్యా శాఖలో అలా లేదు. ఉపాధ్యాయులు లేని బడులు ఎప్పుడు కూలిపోతాయో తెలియక భయపడుతున్న భవనాలు, విద్యార్థులు కొన్ని పాఠశాలకు కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో చిన్నారుల చదువులు ప్రశ్నార్థకంగా మారింది.



గుమ్మరేవులులో టీచర్లు లేక తరగతులు జరగక పశువులను మేతకు తీసుకెళ్తున్న విద్యార్థులు

పాఠశాల పరిస్థితి ఇలా..

అల్లూరి జిల్లాలో పాడేరు నియోజకవర్గంలో 5 మండలాల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా వేధిస్తుంది. ఉన్న ఉపాధ్యాయులే సర్దుబాటు చేసి పిల్లలకి పాఠాలు చెప్పించే పరిస్థితి దారితీసింది. పాడేరు మండలంలో అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం 161 మొత్తం పాఠశాలకు ఆరుగురు ఉపాధ్యాయులు కొరత ఉంది మండలంలో 10,343 విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇది పాడేరు జిల్లా కేంద్రం కావడంతో అందరూ ఉపాధ్యాయులు ఇక్కడే ఉద్యోగం చేయాలని కోరడంతో ఆరుగురు మాత్రమే కొరత ఉంది.

- జి.మాడుగుల మండలంలో మొత్తం 202 పాఠశాలకు 67 మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆ పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న 12,200 విద్యార్థులు చదువుకి దూరమై తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు.
- కొయ్యూరు మండలంలో 153 పాఠశాలలో 37 మంది ఉపాధ్యాయులు లేరు. కొత్త ఉపాధ్యాయులు రాకముందే ఇక్కడ ఉన్న ఉపాధ్యాయుని వేరే చోటకి బదిలీ చేయడంతో ఈ సమస్య విద్యార్థులకు తలెత్తింది. దీంతో చాలామంది విద్యకు దూరమవుతున్నారు.
- చింతపల్లి మండలంలో ఎక్కువమంది ఉపాధ్యాయులు లేకపోవడం చాలా బాధాకరం.209 పాఠశాలలో 81 మంది ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. 15 వేలకు పైగా విద్యార్థులు ఈ మండలంలో చదువుతున్నారు.

దారుణంగా గూడెం కొత్తవీధి మండలం...

అల్లూరి జిల్లా మండల కేంద్రానికి అత్యంత మారుమూల ప్రాంతంలో ఉన్న గూడెం కొత్తవీధి మండలం విద్య పూర్తిగా గాడి తప్పింది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.ఈ మండలంలో ప్రాథమిక పాఠశాలలో 172 పాఠశాలలు ఉండగా 41 పాఠశాలలో ఉపాధ్యాయులు లేరు. ప్రాథమిక విద్యను నేర్చుకునే 6,558 విద్యార్థుల సంఖ్య ఈ మండలంలో ఎక్కువగా ఉంది. అత్యంత మారుమూల గుమ్మరేవుల పంచాయతీలోని ఎక్కువ మంది ఉపాధ్యాయులు లేరు.దీంతో చాలామంది విద్యార్థులు ఆటలకు పరిమితమై కనీసం మధ్యాహ్న భోజనం కూడా అందని పరిస్థితి నెలకొంది.

అయోమయంలో ఉపాధ్యాయులు

పాఠశాలలో పున:ప్రారంభించిన నుంచి ఉపాధ్యాయులు అయోమయంలో పడింది. కొత్తగా నియమించబడిన ఉపాధ్యాయులు విధుల్లో చేరాక బదిలీలు చేస్తే బాగుండేది అని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు. రెండు నెలల ముందుగానే బదిలీలు చేపట్టడంతో కొత్తగా జాయిన్ అయిన స్కూల్లో ఫేస్ స్కానింగ్. జీతాలు తీసుకోవాల్సి వస్తుంది. ముందు పని చేసిన స్కూల్లోనే కొన్నిచోట్ల అధికారులు ఒత్తిళ్లతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఇలా కొత్త స్కూలు పాత స్కూల్‌కి తిరుగుతూ విధులు నిర్వహించవలసిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ఆందోళన చెందొద్దు

కొత్త ఉపాధ్యాయులు వచ్చేవరకు సర్దుబాటు చేస్తున్నాం.. పాడేరులోని అయిదు మండలాల్లో ఇబ్బందులు తలెత్తిన ప్రతిచోట ఉపాధ్యాయులు సర్దుబాటు చేయిస్తూ తరగతి గదులు నిర్వహిస్తున్నామని ఏజెన్సీ డీఈవో బాలాజీ చెప్పారు. మరో వారంలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు చేపడతామన్నారు. తల్లిదండ్రులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు.

చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకం



80 రోజులుగా ఉపాధ్యాయులు లేక మా పిల్లలు చదువుకు దూరమయ్యారు. గత ఏడాది నేర్చుకున్న పాఠాలు మొత్తం మర్చిపోయారు. ఇది పూర్తిగా ప్రభుత్వం నిర్లక్ష్యమే తక్షణమే ఉపాధ్యాయుల నియమించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించి వారిని భవిష్యత్తు బాగు చేయాలని కోరుతున్నాం.

– కుర్ర బలరాం, పెట్రాయి, విద్యార్థి తండ్రి.

ఉపాధ్యాయులు చేరేదెన్నడో



ఏ ప్రభుత్వమైనా కొత్త ఉపాధ్యాయులు వచ్చాక పాతవారిని బదిలీ చేస్తారు. కానీ ఈ ప్రభుత్వం ఉన్న ఉపాధ్యాయుని బదిలీ చేసి విద్యార్థి యొక్క జీవితాలతో ఆటలాడుతున్నారు. గుమ్మరేవుల పంచాయతీలో దారుణంగా ప్రాథమిక విద్య వెనకబడింది. తక్షణమే ఉపాధ్యాయులను నియమించకపోతే ఆందోళన చేపడతాం.

– కమలమ్మ, సర్పంచ్, గుమ్మరేవుల పంచాయతీ

ఉపాధ్యాయుల్ని నియమించండి మహాప్రభో

గూడెం కొత్తవీధి: మండలం గుమ్మరేవుల పంచాయతీలో ప్రభుత్వ పాఠశాలలు ఈ ఏడాది జూన్ నెల ప్రారంభం నుంచి నేటి వరకు ఒక్కరోజు పాఠశాలలు తెరుచుకోలేదు. గుమ్మిరేవులు, కాకనూరు, చెరుకుమళ్ల, నేలజర్త, మాదిగమల్లు , తోకరాయి, కమ్మరితోట, బోడిరాయి, పాఠశాలలు మూత పడ్డాయి. దీంతో పిల్లలు విద్యకు దూరమై ఊర్లో ఖాళీగా తిరుగుతున్నారు. పలుమార్లు అధికారులను కలిసి సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. నెలజర్త పాఠశాలలో 100 మంది పిల్లలకు ఒక్క టీచర్ కూడా లేరు. కేవలం భాష వలంటీర్ తోనే గత నెల రోజులుగా నడుస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఉపాధ్యాయులు నియమించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని డిమాండ్ చేస్తున్నారు.

పట్టుపురుగుల పెంపకంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రజిత



సదస్సుకు హాజరైన పట్టు రైతులు

కూనవరం: టస్సార్ పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక లాభాలు సాధించేందుకు మెలకువలు గురించి ప్రాంతీయ పట్టు శోధన సంస్థ వరంగల్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ కె.రజిత శనివారం టస్సార్ పట్టు రైతులకు వివరించారు. మండలంలోని పైదిగూడెం టస్సార్ పట్టు పురుగుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. సీటీఆర్ టీఐ (సెంట్రల్ టస్సార్ రీసెర్చ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ రాంచీ) నాణ్యమైన దిగుబడుల కోసం తయారు చేసిన డెప్రోటిక్స్, జీవనసుధ, ఎల్.ఎస్.ఎం, ఎల్.వి.ఎస్.మందులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం చింతూరు డివిజన్ పట్టు పరిశ్రమ అధికారి జి.వి.హరికృష్ణ రైతుల సమస్యలపై వారితో చర్చించారు. చిట్టిబాబు, సదానందం , సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాల అమలుకు ఉద్యమించాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

ఎటపాక: ఆదివాసీ హక్కులు, చట్టాల అమలుకు యువత ఉద్యమించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్ర స్థాయి సెమినార్ గిరిజన అభ్యుదయ భవన్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కొమరం భీం, బీర్సా ముండా చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు, ఆదివాసీ నేత సొందె వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలు అమలు కాక నిర్వీర్యం అవుతున్నాయన్నారు. వాటి అమలుకు ఆదివాసీ యువత సంఘటితంగా పోరాటాలు చేయాలన్నారు. అనంతరం 1/70 , పీసా, రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్ భూభాగంలోని హక్కులు, అట్రాసిటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఉద్యోగ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ దేవదానం, శ్రీను, నర్సింహమూర్తి, మురళి, నాగరాజు, ముద్దరాజు, దుర్గారెడ్డి, నవీన్, మంగేశ్వరావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి



రాజవొమ్మంగి సర్పంచ్ రమణి

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పంచాయతీలోని అప్పలరాజుపేట, వయ్యేడు, బూరుగపల్లి, ముర్లవానిపాలెం, శ్రీరాంనగర్ లలోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు లేక పిల్లలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతు పౌష్టికాహారం కోసం ఈ సెంటర్లకు చదువుకోడానికి వచ్చే పిల్లల, పౌష్టికాహారం కోసం వచ్చే బాలింతలు, గర్భిణుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా సెంటర్లను మెరుగుపరచాలని, అన్ని సదుపాయాలు కల్పించాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. ఈ కేంద్రాలు దాదాపు 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ భవనాలు శిథిల స్థితికి చేరుకోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, ఆయా కేంద్రాల్లో ఉపకరణాల పెంపుపై అధికారులు శ్రద్ధ చూపాలని కోరారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రావు

అడ్డతీగల: బాలికలు చిన్నతనం నుంచి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఎదగాలని అల్లూరి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్‌రావు అన్నారు. అడ్డతీగల ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు వివిధ అంశాలపై శనివారం అవగాహన కల్పించారు.మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలను అవగతం చేసుకుని సేవలు ఉపయోగించుకోవాలన్నారు. శక్తి యాప్ ఉపయోగాలు గురించి తెలిపారు.బాల్య వివాహాలు చేసుకున్నా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం నేరమన్నారు. పోక్సో చట్టం లైంగిక దాడుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు.సైబర్ క్రైమ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై వివరించారు. సీఐ బి.నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొయ్యూరు: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అర్చకుడు రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

86 మందికి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: మండలంలో గల బంగారుమెట్ట పంచాయితీ కేంద్రంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి 86 మందికి వైద్యపరీక్షలు చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, టీబీ వంటి వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు ఆమె సూచించారు. హెచ్‌ఎం రాజేశ్వరి, కిలగాడ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలి

కొయ్యూరు: గదబపాలెం పంచాయతీలో కొత్తూరు అంగన్‌వాడీ మినీ కేంద్రాన్ని ఆడాకుల పంచాయతీలో డి.కొత్తూరు మినీ కేంద్రాన్ని మెయిన్ కేంద్రాలుగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. పిల్లలు ఎక్కువగా ఉన్న కేంద్రాలను విస్మరించడం అన్యాయమన్నారు. ఆయా గ్రామస్తులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ చిన్నారులు లేని రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మెయిన్ సెంటర్‌గా మార్చారని, పిల్లలు ఎక్కువగా ఉన్న డి.కొత్తూరును మార్చలేదన్నారు. దీనిపై సీడీపీవో చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మండలంలోని 74 మినీ కేంద్రాలుండగా, వాటిలో 39 కేంద్రాలను మాత్రమే మెయిన్ సెంటర్లుగా మార్చారన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఎక్కువ పిల్లలు ఉన్న మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్చాలని వారు కోరారు.

సాగు భూముల ఆక్రమణలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజేష్

ఎటపాక: ఉద్యమాల పేరుతో సాగు భూముల్లో జెండాలు పాతి ఆక్రమణలకు పాల్పడడం తగదని, సొసైటీ చైర్మన్ రాజేష్ చెప్పారు. నందిగామలో భూఆసాములు పార్టీల నాయకులతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సాగు భూముల్లో జెండాలు పాతడంతో రైతులు భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు.ఈ విషయాన్ని ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకెళ్లామన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలన్నారు. వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం భగవద్గీతపై అవగాహన

మునగపాక: తిమ్మరాజుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం భగవద్గీతపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు భగవద్గీత శ్లోకాలు, తాత్పర్యాలను విశ్రాంత పంచాయతీ రాజ్ ఇంజినీర్ శరగడం పరదేశి నాయుడు వివరిస్తారని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పెదబయలులో రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ, పెదబయలు మండలం కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణలో సంబంధించి ఆక్రమణలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్టు తహసీల్దార్‌త్రినాథరావునాయుడు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో రోడ్డు కిరువైపులా 50 అడుగుల మేరకు రోడ్డు విస్తరణకు సంబంధించి వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారని అయితే కొందరికి గడువు ఇచ్చిన తొలగించకపోవడంతో విస్తరణ పనులు చేపట్టామన్నారు.ప్రధాన రహదారిలో ఇరువైపులా జేసీబీ సహాయంతో ఆక్రమణల తొలగింపు జరుగుతుందని, తొలగించిన దానికి దాటి ఎలాంటి నిర్మాణాలు చేపట్ట వద్దన్నారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆర్ఐ పూర్ణయ్య, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు మండల కేంద్రానికి జోలాపుట్టు, డుడుమ, కుమడ మార్గాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ప్రయాణికుల వివరాలు సేకరించి, అనుమానితుల ప్రశ్నించి, విడిచిపెట్టారు. వాహనాల రికార్డుల పరిశీలించి, పరిమితికి మించి ప్రయాణికులు ఉన్న ప్రైవేట్ వాహనాలపై జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, ముఖ్యంగా మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎస్ఐలుగా శివకుమార్, వెంకయ్య బాధ్యతల స్వీకరణ



శివకుమార్



వెంకయ్య

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా టి.శివకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇంత వరకు డొంకరాయి ఎస్ఐ పనిచేస్తు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన నరసింహమూర్తికి గుర్తేడు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

డొంకరాయి ఎస్ఐగా వెంకయ్య

మోతుగూడెం: వై.రామవరం మండలం డొంకరాయి ఎస్ఐగా వెంకయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గుర్తేడు ఎస్ఐగా పనిచేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఐ శివకుమార్ రాజవొమ్మంగి బదిలీపై వెళ్లారు.

పాడేరు మెడికల్ కాలేజీకి మల్లుదొర పేరు పెట్టాలి

సీలేరు: జిల్లాలో పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు, విశాఖపట్నం మొట్టమొదటి పార్లమెంట్ సభ్యుడు శ్రీ గాం మల్లుదొర పేరు పెట్టాలని కాంగ్రెస్ నాయకుడు కారే శ్రీనివాసు కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు, ఏలూరు వైద్య కళాశాలకు ప్రముఖ బయో కెమిస్ట్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును ప్రకటించిందన్నారు.అలాగే స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి, దేశభక్తిని భవిష్యత్ తరాలు గుర్తుంచుకునే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ గాం మల్లుదొర పేరు పెట్టాలని కోరారు. మహనీయుని సేవలు,త్యాగాలు పోరాట పటిమ భవిష్యత్ తరాలు గుర్తుపెట్టుకొని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గాం మల్లుదొర పేరును ప్రకటించాలని నాయకుడు కోరారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్



హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: హైడ్రోపవర్ ప్రాజెక్టు ఒప్పందాలు తక్షణమే రద్దు చేయాలని, గిరిజన మంత్రి సంధ్యారాణి ద్వంద వైఖరిని విడనాడి ఆదివాసుల పక్షాన నిలబడాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కె.హరి శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతుల జీవో 51 రద్దు చేయాలన్నారు.లేనిపక్షంలో గిరిజనులు నష్టపోతారని వాటి ఒప్పందాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయ్యాలని డిమాండ్ చేశారు. అనంతగిరి మండలంలోని పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు, మజ్జివలస, వేంగడ, పైనంపాడు, వాలసి హుకుంపేట మండలం భూర్జ, అరకు లోయ మండలం బస్కి పంచాయతీల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులిచ్చి గిరిజనులకు జలసమాధి చేసేందుకు కుట్రపన్నుతుందని ఆరోపించారు. గిరిజన ప్రాంతంలో ఇంత జరుగుతున్నా గిరిజన మంత్రి స్పందించపోవడం చాల బాధాకరమన్నారు. తక్షణమే స్పందించి హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయ్యాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూటంగి ఎంపీటీసీ సభ్యుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.